అప్పుల చిట్టాలో చిట్టచివరన!

మొదటిపేజీ తరువాయి...

అప్పులు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నట్టు నిరూపితమైంది. ఈ ఏడాది మార్చి 31 వరకు తెలంగాణ రూ.4,42,298 కోట్లు మాత్రమే అప్పు చేసిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ)లో అది కేవలం 26.2 శాతం అని పే ర్కొంది. దేశంలో అత్యధిక అప్పులు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ 24వ స్థానంలో, ఏపీ 12వ స్థానంలో ఉన్నాయి. 2025 మార్చి 31 నాటికి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తీసుకున్న అప్పులపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్‌తివారీ సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌదరి గణాంకాలతోసహా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. రిజర్వు బ్యాంకు అంచనా ప్రకారం.. 2025 మార్చి 31 నాటికి తెలంగాణ రాష్ట్రం అప్పు రూ.4,42,298 కోట్లు మాత్రమేనని స్పష్టంచేశారు. కేంద్రం విధించిన రుణ పరిమితి (ఎఫ్ఆర్‌బీఎం)కి లోబడి జీఎస్‌డీపీలో కేవలం 26.2 శాతం రుణ సమీకరణ చేసిందని చెప్పారు.

అత్యధిక అప్పులుచేసిన ఐదు రాష్ట్రాలు ఇవే..

దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా తమిళనాడు రూ.9,55,691 కోట్లు అప్పు చేయగా, ఉత్తరప్రదేశ్ రూ.8,57,844 కోట్లు, మహారాష్ట్ర రూ.8,12,068 కోట్లు, పశ్చిమబెంగాల్ రూ.7,14,196 కోట్లు, కర్ణాటక రూ.7,25,456 కోట్ల రుణాలతో మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. జీఎస్‌డీపీలో అత్యధికంగా అరుణాచల్‌ప్రదేశ్ 57 శాతం, ఒడిశా అత్యల్పంగా 16.3 శాతంతో అప్పులు తీసుకున్నాయి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో 34.7 శాతం అనగా రూ.5,62,557 కోట్లు రుణాలు తీసుకున్నది. జీఎస్‌డీపీ ప్రకారం అప్పుల్లో టాప్ ఐదింటిలో అరుణాచల్ ప్రదేశ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం అప్పు రూ.2,67,35,462 కోట్లు ఉన్నట్టు కేంద్ర మంత్రి వివరించారు.

జీఎస్‌డీపీ ప్రకారం అప్పులు తీసుకున్న రాష్ట్రాల వివరాలు

నం.	రాష్ట్రం	అప్పు కోట్లలో	జీఎస్‌డీపీ%
1	అరుణాచల్‌ప్రదేశ్	25,464	57.0
2	పంజాబ్	3,78,453	46.6
3	హిమాచల్‌ప్రదేశ్	1,02,594	45.2
4	నాగాలాండ్	20,197	40.0
5	మేఘాలయ	23,145	39.0
6	పశ్చిమబెంగాల్	7,14,196	38.0
7	బీహార్	3,61,522	37.3
8	కేరళ	4,71,091	36.8
9	మణిపూర్	19,917	36.7
10	రాజస్థాన్	6,37,035	35.8
11	సిక్కిం	19,038	35.0
12	ఆంధ్రప్రదేశ్	5,62,557	34.7
13	ఉత్తరప్రదేశ్	8,57,844	31.8
14	మధ్యప్రదేశ్	4,80,976	31.6
15	మిజోరాం	14,201	31.6
16	హర్యానా	3,69,242	30.4
17	తమిళనాడు	9,55,691	30.3
18	గోవా	35,724	30.2
19	ఛత్తీస్‌గఢ్	1,63,266	29.1
20	త్రిపుర	26,607	27.9
21	అసోం	1,77,983	27.5
22	జార్ఖండ్	1,34,867	26.6
23	కర్ణాటక	7,25,456	26.5
24	తెలంగాణ	4,42,298	26.2
25	ఉత్తరాఖండ్	95,408	24.2
26	మహారాష్ట్ర	8,12,068	19.0
27	గుజరాత్	4,94,436	17.9
28	ఒడిశా	1,54,960	16.3

ఆర్బీఐ నుంచి మరో 1,500 కోట్ల అప్పు

ఈ వేలం ద్వారా తీసుకున్న సర్కారు

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.56,209 కోట్లు

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి రేవంత్‌రెడ్డి సర్కారు మరో రూ.1,500 కోట్ల రుణం తీసుకున్నది. మంగళవారం నిర్వహించిన ఈ– వేలం ద్వారా ఈ మొత్తం సేకరించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. 27 ఏండ్ల కాల పరిమితికి రూ.1000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితికి మరో రూ.500 కోట్లను 7.07 శాతం వార్షిక వడ్డీతో రుణ సమీకరణ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ నుంచి మంగళవారం వరకు ఒక్క ఆర్బీఐ నుంచే అక్షరాల రూ.71,327 కోట్లు అప్పుగా తీసుకున్నది. 2024–25వ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నుంచి ఈ వేలం ద్వారా రూ.56,209 కోట్లు సేకరించింది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఆర్బీఐ నుంచి పొందిన రుణాలు

నెల	రుణ మొత్తం
2024 ఏప్రిల్	4000 కోట్లు
2024 మే	4000 కోట్లు
2024 జూన్	5000 కోట్లు
2024 జూలై	8000 కోట్లు
2024 ఆగస్టు	6000 కోట్లు
2024 సెప్టెంబర్	4,500 కోట్లు
2024 అక్టోబర్	4,500 కోట్లు
2024 నవంబర్	1000 కోట్లు
2024 డిసెంబర్	3,909 కోట్లు
2025 జనవరి	5,800 కోట్లు
2025 ఫిబ్రవరి	3,000 కోట్లు
2025 మార్చి	6,500 కోట్లు
మొత్తం	56,209 కోట్లు

భారత రిజర్వు బ్యాంకు రిపోర్టు ఆధారంగా..

బీసీల నడుమ సర్కారు చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

చీలిన పరిస్థితి కనిపిస్తున్నది. ప్రభుత్వం పంచన చేరి ఉనికి కోసం కొందరు పాకులాడుతుంటే, చట్టాల్లోని లోపాలను ఎత్తిచూపుతూ, వాటిని సవరించాలని, లేదంటే మొదటికే మోసం వస్తుందని మేధావి వర్గం ఆందోళన చెందుతున్నది. ఇదే అదునుగా కాంగ్రెస్ సర్కారు అనుకూల కులసంఘాలను ప్రోత్సహిస్తూ పబ్బం గడుపుకుంటున్నది. ఇప్పుడిదే విషయం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిన నాటి నుంచీ కొన్ని బీసీ, కుల సంఘాలు ఆ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నాయి. కొన్ని ప్రత్యక్షంగా, మరికొన్ని పరోక్షంగా ఎన్నికల్లో ప్రచారం కూడా చేశాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ అడుగడుగునా బీసీ నాయకత్వాన్ని పట్టించుకోకవడం, కులగణన మినహా ఇతర డిక్లరేషన్ హామీల ఊసే ఎత్తలేదు. ఎమ్మెల్యే సీట్ల కేటాయింపు మొదలు, ఇటీవల నామినేటెడ్ పదవుల భర్తీ వరకూ కాంగ్రెస్ మోసం చేస్తూనే ఉన్నదని వివిధ బీసీ సంఘాలు బాహాటంగా నిప్పులు చెరుగుతున్నాయి.

తొలి నుంచి లోపాలపై అభ్యంతరాలు

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వేలో ప్రామాణికత లేకుండా చేసిందని వివిధ కులసంఘాలు, మేధావి వర్గాలు తొలి నుంచి అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నాయి. తాజాగా 2 బీసీ బిల్లుల రూపకల్పనలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అదేతరహా లోపభూయిష్టమైన విధానాలను అమలు చేసిందని ఆగ్రహంతో ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బీసీ కమిషన్ నివేదిక లేకుండా, డెడికేటెడ్ కమిషన్ నివేదికనే రెఫరెన్స్‌గా పెట్టి విద్యా, ఉద్యోగ రంగాల రిజర్వేషన్లను పెంచిందని, ఆది నుంచీ అడ్డదిడ్డంగా జీవోలను జారీ చేసిందని, తిరిగి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తక తప్పని పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. సర్వేలో అడుగడుగునా వెల్లడైన లోపాలను సవరించకుండానే, అసంబద్ధమైన గణాంకాలతో చట్టాలను చేసినా, ఇప్పటికీ కులాల వారీగా లెక్కలను బయటపెట్టకపోయినా కూడా కొన్ని కులసంఘాల ప్రతినిధులు, బీసీ మేధావులు మాత్రం నోరు మెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది. లోపాలను ఎత్తిచూపి, సర్వే సక్రమంగా జరిగేలా చూడకుండా, ప్రభుత్వం పంచనచేరి ఉనికికోసమే వారు పాకులాడుతున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ మేధావులు, సామాజికవేత్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

సర్కారు కనుసన్నల్లో..

బీసీ మేధావులు, కులసంఘాలు ఏకతాటిపై రాకుండా కాంగ్రెస్ సర్కారు సైతం ఆది నుంచీ ఆచితూచి వ్యవమరిస్తున్నది. అనుకూలమైన మేధావి వర్గాన్ని, కులసంఘాల నేతలను ముందుపెట్టి ఆది నుంచీ ఇంటింటి సర్వే, చట్టాల రూపకల్పన మంత్రాంగాన్ని నడిపిస్తూ వస్తున్నది. అనుకూల బీసీ వర్గాలతో భేటీలు అవుతూ ప్రోత్సహిస్తున్నది. బీసీ రిజర్వేషన్ల అంశంపై చట్టాలను చేసిన అనంతరం ప్రభుత్వం కనుసన్నల్లోనే కొన్ని కులసంఘాల నేతలు ఉత్సవాలు చేసినట్టు చర్చ జరుగుతున్నది. చట్టాలు ఆచరణలోకి తీసుకురాకముందే హడావుడి చేస్తూ, సర్కారుకు జేజేలు కొట్టడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన ఓ బీసీ సంఘం నేతకు నామినేటెడ్ పదవిని ఆశచూపి సర్కారు తనకు అనుకూల కార్యక్రమాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నది. త్వరలోనే ఢిల్లీలో ధర్నా కోసం ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్న సర్కారు, ప్రత్యేక రైళ్లను బుక్ చేసి అందుకోసం వివిధ బీసీ నేతలను పంపేందుకు సన్నాహాలు చేసిందని సమాచారం.

సర్వే జరగడం.. చట్టం రావడమే గొప్ప

ఇంటింటి సర్వే, బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంలో అనేక లోపాలున్నా కొన్ని కులసంఘాలు, మరికొందరు మేధావులు సర్కార్‌కు ఏకపక్షంగా మద్దతునిస్తూ వస్తున్నాయని బీసీల్లోని మరో మేధావివర్గం, పలు కులసంఘాలు మండిపడుతున్నాయి. సర్వే ప్రారంభంక కాకముందే కొన్ని సంఘాల నేతలైతే ఏకంగా ప్రభుత్వ పెద్దలను కలిసి సన్మానాలు కూడా చేశాయని, అదేమని నిలదీస్తే సర్వేను ప్రభుత్వం చేపట్టడమే మహా గొప్ప అనే తరహాలో అవి క్షేత్రస్థాయిలో ప్రచారం చేశాయని గుర్తుచేస్తున్నారు. సర్వే నివేదిక వచ్చిన అనంతరం ఏమైనా లోపాలు ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, అవసరమైతే న్యాయపరంగానైనా కొట్లాడుదామని పిలుపునిచ్చినా, ఆయా సంఘాల నేతలు, కులసంఘాల ప్రతినిధులు ఉలుకు పలుకు లేకుండా పోయాయని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కులాల వారీ లెక్కలను బయటపెట్టకుండానే చట్టాలను చేసినా సర్కారును నిలదీయకుండా, లోపాలను ఎత్తిచూపకపోవడంపై నిప్పులు చెరుగుతున్నారు. కేవలం ఉనికి కోసం, ప్రభుత్వ పెద్దల మెప్పుకోసమే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని బీసీ హక్కులను తాకట్టు పెడుతున్నాయని ధ్వజమెత్తుతున్నారు.

ప్రభుత్వతీరుపై సామాజికవేత్తల భగ్గు

రెండువర్గాలుగా చీలిపోయిన కులసంఘాలు, బీసీ మేధావివర్గం తీరుపై సామాజికవేత్తలు తీవ్ర అసహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా ప్రభుత్వ తీరునూ తప్పుబడుతున్నారు. ప్రజా ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నావళిని తయారుచేసి ప్రజాకులగణన నిర్వహించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎంతగా చెప్పినా రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించిందని ఆక్షేపిస్తున్నారు. సర్వేను నామమాత్రంగా నిర్వహించి, ఆ అసంబద్ధ గణాంకాలతో చట్టాలను చేసి మళ్లీ న్యాయపరమైన వివాదాల్లోకి నెట్టాలనే కుట్రలనే అమలు చేస్తున్నదని సామాజిక వేత్తలు నొక్కి చెప్తున్నారు. ఐక్యతను ప్రదర్శించి, ప్రభుత్వం కుట్రలను బట్టబయలు చేయాల్సిన కులసంఘాలు, బీసీ మేధావులు రెండుగా చీలిపోవడంపై సామాజికవేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ నేతల మధ్య భగ్గుమన్న వర్గపోరు

- **ఆర్ కృష్ణయ్య, జాజుల మధ్య విభేదాలు**
- **పరస్పరారోపణలతో రోడ్డుకెక్కిన నేతలు**
- **జాజులపై, కృష్ణయ్యపై తీవ్ర ఆరోపణలు**

రవీంద్రభారతి, మార్చి 25: బీసీ నేతల మధ్య వర్గపోరు భగ్గుమన్నది. ఎప్పటి నుంచో ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. బీసీ కీలక నేతలైన ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్ వర్గాలు పరస్పర ఆరోపణలతో రోడ్డుకెక్కాయి. బీసీ ఉద్యమాన్ని పలుచన చేసే దిశగా ఒకరిపై ఒకరు తీవ్రమైన విమర్శలు గుప్పించుకున్నారు. మంగళవారం జాజుల వర్గం మీడియా ఎదుట ఆరోపణలు గుప్పించగా, ఇదేరోజు ఆర్ కృష్ణయ్య వర్గం అంతకు ముందురోజు మీడియా ఎదుట ప్రత్యారోపణలతో మాటల తూటాలు పేల్చుకున్నారు. బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆర్ కృష్ణయ్యపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ పార్టీల పంచన చేరుతూ బీసీ ఉద్యమాన్ని తాకట్టుపెట్టి వ్యక్తిగత పదవులు పొందిన ఘనత బీజేపీ నేత ఆర్ కృష్ణయ్యకే దక్కిందని, అందుకే ఆయన త్యాగ కృష్ణయ్య కాదని, రాజీ కృష్ణయ్య ఐక్యవేదిక బీసీ సంఘాల నేతలు మంగళవారం ఘాటుగా ఆరోపించారు. ఆర్ కృష్ణయ్య తన చర్యలతో బీసీ సమాజం పరువు తీస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జాజులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన అనుచరులతో బెదిరింపు ధోరణులు మానుకోకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సోమవారం ఆర్ కృష్ణయ్య తరపున బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామూర్తిగౌడ్, ర్యాగ రమేశ్, నీల వెంకశ్, సీ రాజేశ్, అనంతయ్య, మల్లేశ్‌యాదవ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన డబ్బు మూటలకు అమ్ముడుపోయిన జాజుల శ్రీనివాస్‌గౌడ్.. ఆర్ కృష్ణయ్యపై అవాకులు చెవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి దగ్గర 25 లక్షల డబ్బు మూటలు తీసుకొని బీసీ సమాజాన్ని తాకట్టుపెట్టారని, జాజుల తీసుకున్న ఆ రూ.25 లక్షలను సాక్షాలతో సహా త్వరలో బయట పెడతామని రామ్మూర్తిగౌడ్ వెల్లడించారు.

రేషన్‌కార్డు ఉంటేనే.. రాజీవ్ యువ వికాసం

పథకం అమలుకు సర్కారు లంకె • కుటుంబంలో ఒక్కరికే అవకాశం

మండల, జిల్లా స్థాయిలో స్క్రీనింగ్ • జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదిస్తేనే రుణం

జనాభా నిష్పత్తి ప్రకారమే యూనిట్లు • పథకం మార్గదర్శకాలు జారీ

పాత దరఖాస్తులపై ఎటూతేల్చని ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఊరించిన రాజీవ్ యువ వికాసం పథకం యువతను ఊసూరుమనిపిస్తున్నది. కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమేగాక, రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హులని సర్కారు షరతులు విధించడమే అందుకు కారణం. మండల, జిల్లా స్థాయిలో స్క్రీనింగ్ చేయడంతో పాటు, ఆపై సదరు జిల్లా మంత్రి ఆమోదం పొందితేనే రుణాలు మంజూరయ్యేలా నిబంధనలు రూపొందించింది. మరోవైపు ఇప్పటికే రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులపై ఎలాంటి స్పష్టతనివ్వలేదు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకానికి సంబంధించి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు స్వీకరించి, జూన్ 2లోపు లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తామని సర్కారు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే.

పథకం మార్గదర్శకాలు ఇలా..

- మండలం, జిల్లా స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా వర్గాలకు యూనిట్ల మంజూరు.
- గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వార్షిక ఆదాయం మించకూడదు.
- రేషన్‌కార్డు తప్పనిసరి. ఒకవేళ లేనట్టయితే ఆదాయం సర్టిఫికెట్ ఉండాలి.
- వ్యవసాయేతర యూనిట్లకు సంబంధించి 21–55 ఏండ్లవారు అర్హులు. వ్యవసాయ సంబంధిత యూనిట్లకు 60 ఏండ్లు మించకూడదు.
- కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అవకాశం. ఐదేండ్లు దాటితేనే మరొకరికి చాన్స్.
- లోన్‌కోసం బ్యాంక్ కాన్సెంట్ పత్రం ఉండాలి.
- మొదటి దరఖాస్తుదారులకు తొలి ప్రాధాన్యం.
- మొత్తం మంజూరైన యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. అందులోనూ ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం.
- దివ్యాంగులకు 5 శాతం.
- తెలంగాణ ఉద్యమకారులు, ఎస్సీ వర్గీకరణ అమరవీరుల కుటుంబాలకు ప్రాధాన్యం.
- ఇప్పటికే స్వయం ఉపాధి పొందుతున్నవారికి.
- కావాల్సిన పత్రాలు
- ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రం
- రవాణా రంగం అయితే డ్రైవింగ్ లైసెన్స్
- వ్యవసాయ రంగమైతే పట్టాదారు పాస్‌బుక్
- దివ్యాంగుల సదరం సర్టిఫికెట్
- పాస్‌పోర్ట్ సైజు ఫొటో
- వల్నరబుల్ గ్రూప్ అయితే మండలస్థాయి కమిటీ జారీచేసే సర్టిఫికెట్

ఆదాయ సర్టిఫికెట్ ఎలా..?

ఈ పథకాన్ని రేషన్‌కార్డుతో సర్కారు ముడిపెట్టింది. రేషన్‌కార్డు లేకుంటే ఆదాయం సర్టిఫికెట్‌ను పెట్టాలని సూచించింది. అయితే ఆదాయ సర్టిఫికెట్ జారీకి రెవెన్యూ అధికారులు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఇక ఇప్పటికే బీసీ బంధు, మైనార్టీ బంధు, ట్రైకార్, తదితర కార్పొరేషన్ల రుణాల కోసం ఆయా వర్గాలకు చెందినవారు భారీగా దరఖాస్తు చేస్తున్నారు. అన్ని కలిపి దాదాపు 7–8 లక్షల దరఖాస్తులు ఉంటాయని అంచనా. అయితే ప్రస్తుతం వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండాపోయింది. ఆన్‌లైన్‌లో ఆధార్‌కార్డు నెంబర్ ఎంట్రీ చేయగానే, ఇప్పటికే రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని అప్లికేషన్ తిరస్కరణకు గురవుతున్నది. మరోవైపు సర్కారు ఆ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారో, లేదో స్పష్టతనివ్వలేదు.

దరఖాస్తు విధానం.. లబ్ధిదారుల ఎంపిక

- **ఆన్‌లైన్‌లో ఓబీఎంఎంఎస్ (ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీకి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేసి మండల ప్రజాపాలన సేవా కేంద్రాలు (ఎంపీడీవో), మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి.**
- దరఖాస్తులను తొలుత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, కలెక్టర్ నియమించిన ప్రత్యేక అధికారి, బ్యాంకు మేనేజర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ కార్పొరేషన్ల ప్రతినిధులు, డీఆర్‌డీఏ ప్రతినిధులతో ఏర్పాటైన మండల కమిటీ పరిశీలిస్తుంది. అర్హుల జాబితాను సిద్ధం చేసి జిల్లా స్థాయి కమిటీకి పంపుతుంది.
- **కలెక్టర్ నేతృత్వంలోని జిల్లాస్థాయి కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్డీఏ పీడీ కన్వీనర్‌గా, అడిషనల్ కలెక్టర్, ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ జీఎం, కార్పొరేషన్ల ఈడీలు, మైనార్టీ, డిసెబుల్డ్, ఉమెన్ వెల్ఫేర్ ఏడీలు, పీడీలు, జిల్లా ట్రైబర్ వెల్ఫేర్ ఆఫీసర్, లీడ్ బ్యాంకులకు సంబంధించిన జిల్లా మేనేజర్ సభ్యులుగా ఉంటారు. జిల్లా లక్ష్యానికి అనుగుణంగా ఆయా వర్గాల జనాభా నిష్పత్తి ప్రకారం లబ్ధిదారుల జాబితా రూపొందిస్తారు.**
- చివరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందాల్సి ఉంటుంది. అనంతరం లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తారు.
- **100 శాతం సబ్సిడీ రుణాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తారు. అయితే యూనిట్ ఏర్పాటుకు తొలుత 80 శాతం నిధులే విడుదల చేస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత మిగతా 20 శాతం మంజూరు చేస్తారు.**
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత నేరుగా ఆయా ఏజెన్సీలకు నిధులను బ్యాంకు విడుదల చేస్తుంది.
- **అవసరమైతే రుణాలను పొందినవారికి ఆయా రంగాల్లో 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారు.**
- యూనిట్ల గ్రౌండింగ్ పూర్తిచేసిన అనంతరం యూటిలిటీ సర్టిఫికెట్లను (యూసీ) అధికారులు ప్రభుత్వానికి సమర్పించాలి.

ఖాజాగూడలోని కొత్తకుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఎట్టకేలకు కదిలిన హైడ్రా!

- **వంశీరాం బిల్డర్స్‌కు నోటీసులు**
- **తొలుత అనిరుధ్‌రెడ్డి నుంచి ఫిర్యాదే అందలేదన్న హైడ్రా**
- **ఇప్పుడు అదే ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటున్నటు ప్రకటన**
- **చెరువులో మట్టి తొలగించాలంటూ హడావుడిగా నోటీసులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు వంశీరాం బిల్డర్స్ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కదిలారు. వంశీరాం బిల్డర్స్ కొత్తకుంట చెరువులో వేసిన మట్టిని తొలగించాలంటూ నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు నేపథ్యంలో హైడ్రా కమిషనర్ మంగళవారం కాజాగూడలోని కొత్తకుంట (నానక్‌రామ్‌కుంట)ను సందర్శించారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు, నాలుగు రోజుల్లో మట్టిని తొలగించాలని వంశీరాం బిల్డర్స్‌ను ఆదేశించారు. ఈ నెల 14న అనిరుధ్‌రెడ్డి అసెంబ్లీలో చిట్‌చాట్ చేస్తూ, హైడ్రాపై హాట్ కామెంట్స్ చేశారు. తాను వంశీరాం బిల్డర్స్‌పై హైడ్రాకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని, దీనిపై అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రస్తావిస్తానని అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. దీనిపై హైడ్రా స్పందిస్తూ, తనకు ఎమ్మెల్యే నుంచి వంశీరాం విషయంలో ఫిర్యాదే అందలేదని ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా నోటీసులు ఇచ్చి లావాదేవీలు చేస్తున్నదని, వంశీరాం విషయంలో ముఖ్యమంత్రిని కలిసి మరోసారి ఫిర్యాదు చేస్తానని అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. గత సంవత్సరం ఆగస్ట్, డిసెంబర్ నెలల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇచ్చిన రెండు ఫిర్యాదులు తౌతానికుంటకు సంబంధించినవేనని, వంశీరాం మ్యాన్‌హట్టన్ ప్రాజెక్ట్ విషయంలో ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని హైడ్రా కమిషనర్ అదేరోజు ప్రకటించారు. ఇలా అనిరుధ్‌రెడ్డి నుంచి తమకు ఫిర్యాదే అందలేదంటూ చెప్తూ వచ్చిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సోమవారం నుంచి వంశీరాం బిల్డర్స్ విషయంలో, అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదుపై స్వరం మార్చారు. సోమవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో రంగనాథ్ చిట్‌చాట్ చేస్తూ, అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదుపై స్పందించి ఖాజాగూడ కొత్తకుంట చెరువులో మట్టి తొలగించాలంటూ పలు సంస్థలకు నోటీసులిచ్చామని చెప్పారు. తాజాగా మంగళవారం కమిషనర్ ప్రకటనలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు వంశీరాం బిల్డర్స్‌కు నోటీసులిచ్చామని పేర్కొన్నారు. ఇంతకుముందు ఏ ప్రకటనలోనూ అనిరుధ్‌రెడ్డి నుంచి వంశీరాంకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని పేర్కొన్న హైడ్రా.. ఇప్పుడు ఎందుకు ఇలా గొంతు సవరించుకున్నదనే చర్చ ప్రజల్లో జరుగుతున్నది.

బీజేపీకి మేకులా మారిన గ్రోక్

అబద్ధాల బీజేపీకి చుక్కలే: బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): అబద్ధాలతో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీకి గ్రోక్ ఏఐ మేకులా మారిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ 11 ఏండ్లుగా చెప్తున్న వాటిలో నిజమెంతుందో అది తేటతెల్లం చేస్తున్నదని తెలిపారు. టెక్నాలజీని వాడుకొని, అబద్ధాలనే నిజాలుగా నమ్మిస్తూ, వాట్సప్ ద్వారా దేశంలో విద్వేషాన్ని నింపిన బీజేపీకి, ప్రధాని మోదీకి గ్రోక్ చుక్కలు చూపిస్తున్నదని దుయ్యబట్టారు. వాస్తవాలేంటో ప్రజలకు స్పష్టంగా వివరిస్తున్నదని తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై వాట్సప్ యూనివర్సిటీ వెదజల్లిన అసత్యాలను కూడా గ్రోక్ పటాపంచలు చేసి, ఆయన గొప్పదనాన్ని చాటి చెప్పిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటివరకు ఉన్న ముఖ్యమంత్రుల్లో బెస్ట్ ఎవరని అడిగితే కేసీఆరేనని గ్రోక్ స్పష్టం చేసిందని తెలిపారు. బీజేపీని, మోదీని గోకి గోకి.. ఏకిపారేస్తుందని తెలిపారు. బీజేపీని, మోదీని ఎదుర్కోవడంలో రాహుల్ అట్టర్‌ఫ్లాప్ అయ్యారని పేర్కొన్నారు. మోదీకి ఒక ప్రచార వస్తువుగా మారిపోయారని ఎద్దేవా చేసింది. ఈ దశలో గ్రోక్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు.

లోకం పోకడ



హే బచ్చా.. సేఫ్ మాకే గదా?!

'అనర్హత' విచారణలో జాప్యమెందుకు?

మొదటిపేజీ తరువాయి...

పిటిషన్‌ను తిరస్కరించాలని, విచారణార్హత ఉంటే స్పీకర్ నోటీసులు జారీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. వాటికి ఫిరాయింపు ఎమ్మెల్యేలు వారంలో సమాధానం ఇవ్వాలని నిబంధనలు చెబుతున్నాయని తెలిపారు. కానీ పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని చెప్పారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టులో విచారణ జరిపిన ఏకసభ్య ధర్మాసనం.. నాలుగు వారాల్లోగా షెడ్యూల్ ఖరారు చేయాలని తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. అయినా స్పీకర్ కార్యాలయం ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేయలేదని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఒకరు కాంగ్రెస్ తరపున ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని తెలిపారు. ఈ సమయంలో జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుంటూ.. పార్టీ ఫిరాయింపులపై చర్యలు తీసుకోవడానికి ఎంత సమయం ఉండాలి? మొదటి ఫిర్యాదు నుంచి ఇప్పటివరకు ఎంత సమయం గడిచిందని అడిగారు. దాదాపు ఏడాది గడిచిందని న్యాయవాదులు చెప్పగా.. 'ఫిరాయింపుల వార్షికోత్సవం జరిగిందా?' అని జస్టిస్ గవాయ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తాము సుప్రీంకోర్టును ఆశ్రయించిన తర్వాత ధర్మాసనం విచారణ జరిపి 'తగిన సమయం అంటే ఎంతకాలం?. వారి పదవీకాలం పూర్తయ్యే వరకా?' అని ప్రశ్నించిందని తెలిపారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 13న స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేస్తూ.. మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని సూచించిందని తెలిపారు. అయితే స్పీకర్ ఇచ్చిన గడువు ఇప్పటికే ముగిసిందని, ఎమ్మెల్యేల సమాధానాలు ఏమయ్యాయో తమకు తెలియదని న్యాయవాదులు పేర్కొన్నారు.

కోర్టులు జోక్యం చేసుకోవాలి

ఇలాంటి కేసుల్లో ముగ్గురు, ఐదుగురు సభ్యుల ధర్మాసనాలు కొన్ని తీర్పులు ఇచ్చాయని, ఐతే.. తగిన సమయం అంటే ఎంతో స్పష్టంగా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. అలాంటప్పుడు తాము ఉన్నత ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను కాదని ఎలా వెళ్లగలమని ప్రశ్నించింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని వ్యాఖ్యానించింది. దీనిపై అర్యమ సుందరం స్పందిస్తూ.. తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయని గుర్తు చేశారు. మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని తాము కోరడం లేదని చెప్పారు. అయితే రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని తెలిపారు. ఒకవేళ అలా జరగడం లేదని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 ప్రకారం న్యాయసమీక్ష అధికారం కోర్టులకు ఉందని తెలిపారు. కాబట్టి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 2వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. ఆ విచారణలో ప్రతివాదుల వాదనలు వినే అవకాశాలున్నాయి.

విజయ డెయిరీ ఆవుపాల సేకరణ తగ్గింపు?

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

హైదరాబాద్, మార్చి 24 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ కీలక నిర్ణయం తీసుకున్నది. ఆవు పాల ధరను తగ్గించి.. బర్రె పాల ధరను లీటర్‌కు రూ.4 వరకు పెంచేందుకు సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. విజయ డెయిరీ ప్రతీరోజూ 4.5లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. అందులో 85శాతం మేరకు ఆవు పాలు ఉంటున్నాయి. ప్రైవేట్ డెయిరీ సంస్థలు ఆవు పాలు లీటర్‌కు రూ.32 నుంచి రూ.33 వరకు చెల్లించి సేకరిస్తున్నాయి. విజయ డెయిరీ మాత్రం రూ.42 ఇస్తున్నది. బర్రె పాలు లీటర్‌కు రూ.48 చెల్లిస్తున్నది. ఆవు పాల సేకరణతో సంస్థకు ఆదాయం కంటే నష్టమే ఎక్కువ వస్తున్నదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఆవు పాల ధరలను తగ్గించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. విజయ డెయిరీ సంస్థకు దాదాపు రూ. వెయ్యి కోట్ల టర్నోవర్ ఉన్నది. ప్రతినెలా రూ.13కోట్ల పైగా నష్టాలు వస్తున్నట్టు సమాచారం.

ఓవైపు ఎండలు.. మరోవైపు వానలు

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం నెలకొంది. ఓ వైపు ఎండలు ఠారెత్తిస్తుండగా, మరోవైపు అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని.. అలాగే కొన్ని ప్రాంతాల్లో ద్రోణి ప్రభావంతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది.